క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో వెలంపల్లి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దంపతులు శుక్రవారం రాత్రి దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాల గురించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యేకు అమ్మవారికి అలంకరించిన పవిత్రాలను అందచేశారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అన్నదాన వితరణను చైర్మన్ రాంబాబు పరిశీలించారు. భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాన్ని అందచేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోగల కబేళా రోడ్ రహదారి పక్కన ఉన్న నాగలింగేశ్వరస్వామి ఆర్చి కొండ ప్రాంతంలో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య శుక్రవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.4.50 లక్షల నిధులతో కొండపై భాగాన మెట్లు, డ్రెయిన్లు నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. డివిజన్ బాధ్యులు మైలవరపు కృష్ణ, పార్టీ నాయకులు దుర్వేసుల హుస్సేన్, ముత్తా వాసు, బైపినేని కోటేశ్వరరావు, బోర మల్లేశ్వరరెడ్డి, సీహెచ్ లక్ష్మణ్, ముత్యాల రాంబాబు, రవ్వా కోటేశ్వరి, పీతల నాగు, డీ రాము, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వీఎంసీ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ మేళా

పటమట(విజయవాడతూర్పు):నగరంలోని న్యూ రాజేశ్వరీపేట, వాంబే కాలనీలో గతంలో కేటాయించిన ఇళ్ల లబ్ధిదారులకు, కొనుగోలు చేసిన వారికి వీఎంసీ రిజిస్ట్రేషన్ మేళా నిర్వహిస్తుందని కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇళ్లను ఎలాట్ పొందిన వారు, ఎలాట్ పొందిన 10 సంవత్సరాల తర్వాత కొనుగోలు చేసిన నాన్‌ఎలాట్ దారులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇందుకు గజం రూ. 100 చొప్పున 40 గజాల స్థలానికి రూ. 4వేలు, రిజిస్ట్రేషన్ చార్జీల నిమిత్తం రూ. 860 చొప్పున చెల్లించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు ఒరిజినల్ ఎలాట్‌మెంట్ పట్టా, నాన్‌ఎలాట్‌మెంట్‌దారులైతే వారి పేరుత ఒరిజినల్ విక్రయ డాక్యుమెంట్ (లింక్‌తో సహా), నోటరీ అఫడవిట్, ప్రస్తుతం చెల్లిస్తున్న నీటి, ఇంటి పన్నుల రసీదులు, ఆధార్‌కార్డు నకలు, ఇద్దరి సాక్షుల ఆధార్‌కార్డు నకలు తీసుకుని న్యూ రాజరాజేశ్వరి పేటలోని సచివాలయం నం 233, వాంబేబే కాలనీలోని డి బ్లాక్ కమ్యూనిటీ హాల్లో జరిగే మేళాలో సంప్రదించాలని కోరారు. ఈ నెల నాలుగో తేదీ నుంచి వారం రోజులపాటు నిర్వహించే మేళా వినియోగించుకోవాలని కోరారు.

దుర్గాఘాట్ పూడిక తీత పనులు వేగవంతం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గాఘాట్‌లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. దుర్గాఘాట్‌లో పూడిక తీత పనులను శుక్రవారం పరిశీలించారు. పూడిక తీత పనులను వేగవంతంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించడం జరిగిందని, వారం, పది రోజులలో పూడిక తీత పనులు పూర్తవుతాయన్నారు. అనంతరం ఘాట్‌లోని పూజా సామగ్రి విక్రయించే దుకాణాలను ఈవో పరిశీలించారు. ఈఈ ఎల్.రమ, ఇతర ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది ఉన్నారు.

మనోహరం త్యాగరాజ కృతి వైభవం

విజయవాడ కల్చరల్:లయనాద కళాస్రవంతి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న లంకా వేంకటేశ్వర్లు సంగీత సంస్మరణోత్సవాలు త్యాగరాజ స్వామి కృతి వైభవాన్ని చాటుతున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు వాగ్గేయకార కృతులను మధురంగా ఆలపించారు. శ్రావణి కచేరీతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చిన్నారులు పారుపల్లి ఇభానస్ మాండలిన్‌పై పారుపల్లి ప్రభానస్ వేణువుపై మహగణపతిం ఆదితాళం, ఎందరో మహానుభావులు, సామజవరగమన త్యాగరాజ స్వామి కృతులు వెంకటచాల నిలయ కీర్తనలను పలికించారు. చివరిగా జే శ్రీరాం, కేవీ శ్రీరాం, డీ విఘ్నేశ్,కేవ సుధాంశు త్యాగరాజ స్వామి దివ్యనామ సంకీర్తనలు ఆలాపించారు. కేవీ సుబ్బారావు హార్మోనియం, రాఘవచరణ్ తబలపై, అరవింద్ మృదంగంపై సహకరించారు.

కొండ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే వెలంపల్లి



మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని కొండ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పాతబస్తీలోని 52వ డివిజన్ కొండ ప్రాంతంలో శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక డివిజన్ ఇన్‌చార్జి తంగెళ్ల రామచంద్రరావు ఇతర నాయకులతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. కొండ ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తక్షణం చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో మెట్ల సమస్యలు ఉన్నట్లుగా వివరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో అధిక భాగం కొండ ప్రాంతాలు ఉన్నాయన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే దోమలు, మెట్ల సమస్యలను సైతం తీరుస్తామన్నారు. గతంలో ఇక్కడ 1131 మందికి పింఛన్లు ఉన్నాయన్నారు. కొత్తగా నేడు



కొత్తగా మంజూరైన పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

42 మందికి పింఛన్లు ఇవ్వడం జరిగిందన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాలతో పరిష్కరించామని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వస్తున్న వినతులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పూర్ణ, నాయకులు ముదిలి ప్రసన్న, బంక అప్పారావు, సంకబత్తుల అశోక్, వెల్పూరి నీలిమ, మంజు భార్గవి, దేవర సురేష్, సూరిబాబు, కర్రి సతీష్, సుబ్బారెడ్డి ,బైపిళ్ల రమేష్, కృష్ణారావు, నర్సిరెడ్డి, ఎం రాజేష్, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



శ్రావణ శుక్రవారం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఆదిలక్ష్మి



కొత్త పెన్షన్లను అందిస్తున్న మరుపిళ్ల రాజేష్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందచేయడమే ప్రభుత్వ లక్ష్యమని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లో నూతనంగా మంజురైన వైఎస్సార్ పింఛను కానుకలో భాగంగా శుక్రవారం 30 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, డివిజన్ అధ్యక్షుడు పిల్లా సూరిబాబు, దుక్క హరిభాస్కర్, ఆర్. వరలక్ష్మీ, బాయన అమర్‌నాథ్ , పిల్లా నాగమణిలు పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అన్నారు. డివిజన్ పరిధిలో కొత్తగా మంజూరైన 25 మందికి శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు.

చెస్‌లో హేమంత్‌కుమార్‌కు ఫిడే రేటింగ్



హేమంత్‌కుమార్‌ను అభినందిస్తున్న సూర్యారావు, కోచ్ రామకృష్ణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్‌లో తమ విద్యార్థి హేమంత్‌కుమార్ రేటింగ్ సాధించడం అభినందనీయమని శ్రీ గౌతమ్ హైస్కూల్ కరస్పాండెంట్ నల్లాని సూర్యారావు తెలిపారు. గత నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించిన టోర్నమెంట్‌లో రేటింగ్ సాధించిన విద్యార్థికి శుక్రవారం స్కూల్ ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ టోర్నమెంట్‌లో 9 రౌండ్లలో 5.5 పాయింట్లు సాధించడంతో పాటు 1600 గాను 1214 రేటింగ్ సాధించి నగదు పురస్కారం అందుకుందన్నారు. విద్యార్థులను కేవలం చదువులోనే కాకుండా ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌లోనూ శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన హేమంత్‌కుమార్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నామని కోచ్ అవ్వారు రామకృష్ణ పేర్కొన్నారు. హేమంత్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

పుష్పాలతో ప్రత్యేక అలంకరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):శ్రావణమాసం మూడో శుక్రవారం ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ సాధారణంగానే కనిపించింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలిరాగా, ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. నవ దంపతులు, వారి కుటుంబ సభ్యులతో పాటు ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలతో భక్తులు బారులు తీరి కనిపించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకే ఆలయ ప్రాంగణంలో రద్దీ కనిపించింది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారి ప్రధాన ఆలయానికి విశేషం పుష్పాలతో అలంకరించారు. అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ముగియడంతో సాయంత్రం పంచహారతుల సేవ, పల్లకీ సేవ నిర్వహించగా, ఉభయదాతలు పాల్గొన్నారు.

మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నేడు ప్రత్యేక ప్రసంగం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):సీ.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న డిప్లొమో కోర్సు ఇన్ జర్నలిజంలో భాగంగా నేడు శనివారం ప్రత్యేక ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ జి.శ్రీరామ్‌కుమార్ హాజరై రిజిస్ట్రేషన్లు–విధి విధానాలు అనే అంశంపై మాట్లాడతారని పేర్కొన్నారు. డిప్లొమో కోర్సు చేస్తున్న వారితో పాటుగా ఆసక్తి ఉన్న వర్కింగ్ జర్నలిస్టులు జూమ్ ఐడీ–815 9892 6979, పాస్‌వర్డ్–12345 ద్వారా హాజరై ఈ ప్రసంగాన్ని వినవచ్చన్నారు.

అభయలక్ష్మిగా మహాలక్ష్మీ అమ్మవారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):నిజ శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని మహాలక్ష్మీ అమ్మవారికి అభయలక్ష్మీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి అభిషేకాలు, ఉదయం నుంచి విశేష కుంకుమార్చన నిర్వహించగా పలువురు ఉభయదాతలు భక్తులు పూజలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరాగా , దేవస్థాన కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పాతరాజరాజేశ్వరిపేటకు చెందిన ఇంగిరపు అవరంజి, సింహచలం భార్యాభర్తలు. వీరు రెండేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సింహచలం ఆటో నడుపుకుని జీవనం సాగించే వాడు. కొంత కాలంగా మద్యానికి బానిసైన సింహచలం భార్యను పట్టించుకోకుండా వేధింపులకు గురి చేయసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

3న ఘంటసాల సంగీత వైభవంపై ప్రసంగం

విజయవాడ కల్చరల్: స్వరలయ సంగీత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఘంటసాల సంగీత వైభవం, సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు స్వరలయ అధ్యక్షుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్గొండ నాదబ్రహ్మ సంగీత కళాశాల ఆచార్యులు డాక్టర్ ఎం .పురుషోత్తమాచార్య ఘంటసాల సంగీత వైభవం అంశంగా ప్రసంగిస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన గాయనీ గాయకులు క్లాసికల్ చిత్ర గీతాలను ఆలపిస్తారన్నారు.

పారదర్శక ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



ఓటర్ల జాబితా పరిశీలనలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):ఓటరు జాబితాలో తొలగించిన ఓటర్లను పునఃపరిశీలన చేసి పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగ్‌నగర్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూలై నెల 21 తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ నెల రోజులపాటు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలో భాగంగా బూత్ స్థాయి అధికారులు బూత్ లెవల్ ఏజెంట్ల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఇంటింటిని సందర్శించి ఓటర్ల జాబితా పరిశీలన పూర్తిచేశామని చెప్పారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గత సమరి రివిజన్ నుంచి నేటి వరకూ మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్, ఫొటో సిమిలర్ ఎంట్రీస్ గానూ తొలగించిన ఓటర్ల జాబితాను రీ వెరిఫికేషన్ చేస్తున్నామని తెలిపారు. అనర్హత కలిగిన ఓటర్ల తొలగింపు విషయంలో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. బీఎల్‌ఓలు పరిశీలనలో తొలగింపునకు గుర్తించిన ఓటర్లను మరోసారి క్షేత్రస్థాయిలో నూరు శాతం పరిశీలించాలని బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు.

ఈ ప్రక్రియను సెప్టెంబర్ 7వ తేదీలోగా పూర్తిచేసి ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పిస్తామని చెప్పారు. కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, అవుతు శ్రీనివాసరెడ్డి, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎం.వెంకట రామయ్య, ఎం.మాధురి, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీ రవీంద్రనాథ్, సూపర్‌వైజర్ వందనంబాబు, బీఎల్‌ఓ జి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు



38వ డివిజన్‌లో కొత్త పింఛన్ అందచేస్తున్న కార్పొరేటర్ రెహమతున్నీసా, హయాత్ షరీఫ్



45వ డివిజన్‌లో కొత్త పింఛన్ అందచేస్తున్న కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, కృష్ణ



47వ డివిజన్‌లో కొత్త పింఛన్ అందచేస్తున్న కార్పొరేటర్ గోదావరి గంగ, బాబు



వైఎస్సార్ కాలనీలో కొత్త పింఛన్ అంద చేస్తున్న కల్పనా కిషోర్, బయ్యారపు రవి కిషోర్

భవానీపురం(విజయవాడపశ్చిమ):వైఎస్సార్ పింఛన్ కానుక పథకం ద్వారా పశ్చిమ నియోజకవర్గంలో శుక్రవారం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. తెల్లవారు జాము నుంచే ఆయా సచివాలయాల పరిధిలో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందచేశారు. ఇక కొత్తగా మంజూరయిన పింఛన్లను ఆయా డివిజన్ల కార్పొరేటర్లు తమతమ సచివాలయాల్లో లబ్ధిదారులకు అందచేశారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని 194 సచివాలయంలో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా కొత్త పింఛన్ల అందచేశారు. కొత్తగా 16 మంజూరయ్యాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్, కన్వీనర్ ఎస్‌కె నజీర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. రోడ్‌లోని వార్డ్ సచివాలయాల్లో కొత్తగా మంజూరయిన 25 పింఛన్లను 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య లబ్ధిదారులకు అందచేశారు. కొత్తగా 40 మందికి పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. స్థానిక కెఎల్‌రావునగర్ 5వ లైన్‌లోగల 147, 148 సచివాలయంలో కొత్తగా మంజూరయిన 25 పింఛన్లను 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ లబ్ధిదారులకు అందచేశారు. డివిజన్ వైఎస్సార్ సీపీ బాధ్యులు గోదావరి బాబు, కన్వీనర్ రెడపంగు క్రాంతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలో 2,3 సచివాలయాల పరిధిలో నూతనంగా మంజూరయిన 45 పింఛన్లను వైఎస్సార్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ బయ్యారపు కల్పన కిషోర్, విజయవాడ రూరల్ మండల అధ్యక్షులు బయ్యారపు రవికిషోర్ పంపిణీ చేశారు.

వెంకన్న సన్నిధిలో ప్రత్యేక హోమాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



పద్మావతి అమ్మవారికి ప్రత్యేక అలంకారం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పూర్ణాహుతి కార్యక్రమం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో పవిత్రోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ పలు విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున విష్వక్సేనపూజతో వైదిక కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి అంతరాలయంలో నిత్య పూజలు నిర్వహించారు. ఉభయదేవేరులతో కూడిన స్వామి వారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలతో శ్రీకృష్ణ మండపంలోకి తీసుకొచ్చారు. అనంతరం వేద పండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమ పురుషునికి వివిధ ద్రవ్యాలను హోమ గుండంలో వేసి పూర్ణాహుతి నిర్వహించారు. పవిత్ర విసర్జన, దక్షిణాదాన మహదాశీర్వచనాలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆళ్వార్లలో ప్రముఖులైన వారి జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆలయంలో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర నామార్చనలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాస్ పర్యవేక్షించారు. శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్, ముకుందలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఇన్సూరెన్స్ రంగంలో అగ్రగామిగా ఎల్ఐసీ

లబ్బీపేట(విజయవాడతూర్పు):దేశంలో 40 కోట్ల మంది పాలసీదారులకు మెరుగైన సేవలు అందిస్తూ ఎల్ఐసీ అగ్రగామి సంస్థగా వెలుగొందుతుందని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగు కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ అన్నారు. భారతీయ జీవిత బీమా సంస్థ 67వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని బెంజిసర్కిల్ సమీపంలోని బ్రాంచి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వేడుకలను రత్నప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ ప్రగతి పథంలో పయనించడంలో ఉద్యోగులు, ఏజెంట్లు, డెవలప్‌మెంట్ అధికారులు, ఇతర అధికారుల పాత్ర అభినందనీయం అన్నారు. బీమా రంగంలో ప్రైవేటు సంస్థలకు ధీటుగా ఎల్ఐసీ వ్యాపార అభివృద్ధి గావిస్తూ , దేశ ప్రజలకు బీమా రక్షణ, దేశ మౌలిక రంగ అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు. ఆ శాఖ ఎస్‌బీఎం సి.రామకృష్ణ మాట్లాడారు.